చిన్నారుల సమగ్ర వికాసమే లక్ష్యంగా..

ఒక భవనం పటిష్టంగా నిర్మించాలంటే పునాది ఎంత ముఖ్యమో, చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రాథమిక స్థాయిలో నేర్చుకునే విజ్ఞానము అంతే విలువైనది. బాల్యంలో ప్రాథమిక అంశాలపై పట్టు సాధించిన విద్యార్థులు, తర్వాత తరగతుల్లో సంక్లిష్టమైన, కొత్త విషయాలను కూడా సులభంగా నేర్చుకోగలరు. అందుకు అనుగుణంగా చిన్నారుల సమగ్ర వికాసంపై దృష్టి సారించింది రాష్ట్రప్రభుత్వం. ప్రాథమిక విద్యతో పాటు పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి పటిష్టమైన చర్యలు చేపట్టింది. అందులో భాగంగా చిన్నారుల అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరిచేలా ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

- ప్రాథమిక, పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి చర్యలు
- మెరుగైన అభ్యసనానికి 'ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ'
- 'ప్రథమ్' భాగస్వామ్యంతో మూడు జిల్లాల్లో 126 మందికి శిక్షణ


గ్రూప్ యాక్టివిటీలో భాగంగా కాగితంతో కళాకృతులు చేసి అలరించేలా..

అక్కిరెడ్డిపాలెం: విద్యారంగంపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్న రాష్ట్రప్రభుత్వం ప్రాథమిక విద్య బలోపేతానికి కృషి చేస్తోంది. పాఠశాల విద్యలో విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రాథమిక, పూర్వ ప్రాథమిక విద్యను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చింది. పునాది నుంచి విద్యార్థుల అభ్యసనాన్ని బలోపేతం చేసేలా ప్రణాళిక రూపొందించింది. అందులో భాగంగా పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో విద్యార్థి అభ్యసనా సామర్థ్యల పెంపుదలకు ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్) కార్యక్రమాన్ని చేపట్టింది. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రాజెక్టులో భాగంగా ఎన్‌జీఓ సంస్థ ప్రథమ్ భాగస్వామ్యంతో ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాన్ని పూర్వ ప్రాథమిక, ప్రాథమిక పాఠశాలల్లో అమలు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది.

ఈసీసీఈలో భాగంగా..

నూతన విద్యావిధానం 2020లో భాగంగా ప్రభుత్వం పలు విద్యా సంస్కరణలను తీసుకువచ్చింది. నిపుణ్ భారత్ లక్ష్యాలను సాధించే క్రమంలో భాగంగా ఎర్లీ చైల్డ్‌హుడ్ సెంటర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ)ను ప్రవేశపెట్టింది. ఇందులో ప్రీ ప్రైమరీ -1, ప్రీ ప్రైమరీ - 2ను అమలు చేస్తోంది. ప్రీ ప్రైమరీ - 1లో 3, 4 ఏళ్ల చిన్నారులకు, ప్రీ ప్రైమరీ- 2లో 4, 5 ఏళ్ల చిన్నారులకు ఆటపాటలతో కూడిన బోధన అందిస్తారు. ప్రీ ప్రైమరీలోనే పాఠశాల సంసిద్ధత కార్యక్రమాలను అమలు చేస్తారు. ఐదేళ్లు నిండిన చిన్నారులకు ప్రైమరీ తరగతులు నిర్వహిస్తారు. ప్రీ ప్రైమరీ, ప్రైమరీలలో 1, 2 తరగతులకు ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ కార్యక్రమాలను అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా 2026 -27 విద్యా సంవత్సరానికి రెండో తరగతి నుంచి మూడో తరగతికి వెళ్లే విద్యార్థులందరూ ఆయా తరగతుల అభ్యసనా సామర్థ్యలను కచ్చితంగా పొందాల్సి ఉంటుంది.

అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించేందుకు..

10వ తరగతికి చేరుకుంటున్న విద్యార్థుల్లో తెలుగు, గణితంలో ప్రాథమిక భావనలు ఉండటం లేదన్న కఠోర వాస్తవాలను ఎన్నో నివేదికలు బహిర్గతం చేస్తున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించేలా ప్రభుత్వం పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యలను మెరుగు పరిచేందుకు అవసరమైన చర్యలు చేపడుతోంది అందులో భాగంగానే ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ కార్యక్రమం చేపట్టింది. ప్రతీ విద్యార్థి పూర్వ ప్రాథమిక, ప్రాథమిక విద్య (1, 2 తరగతులు) పూర్తి చేసి 3వ తరగతిలో చేరే సమయానికి తెలుగులో చదవటం, రాయడం, వినడం మాట్లాడటం రావల్సి ఉంటుంది. గణితంలో చతుర్విధ ప్రక్రియలైన కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగహారాల్లో పట్టు సాధించాలి.


విద్యార్థులు సులభరీతిలో గ్రహించేందుకు చిత్రాల రూపంలో శిక్షణ ఇచ్చేలా..

జ్ఞాన జ్యోతి..జ్ఞాన ప్రకాష్

ఎఫ్‌ఎల్‌ఎన్ అమల్లో భాగంగా పూర్వ ప్రాథమిక విద్యను జ్ఞాన జ్యోతిగా.. ప్రాథమిక విద్యను జ్ఞాన ప్రకాష్‌గా పేర్కొన్నారు. ముందుగా ప్రాథమిక విద్యను బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు డీఆర్పీల శిక్షణను పూర్తి చేశారు. మండలానికి ముగ్గురు ఎస్‌జీటీలను డీఆర్పీలుగా ఎంపిక చేసి, వారికి రెసిడెన్షియల్ మోడ్‌లో శిక్షణ ఇచ్చారు. ప్రతీ జిల్లాలో అన్ని మండలాల నుంచి డీఆర్పీలు శిక్షణ పొందారు. ఎఫ్‌ఎల్‌ఎన్ 60 రోజుల జ్ఞాన ప్రకాష్ శిక్షణలో భాగంగా విశాఖపట్నం జిల్లా నుంచి 27 మంది డీఆర్పీలు శిక్షణ పూర్తి చేసుకున్నారు. త్వరలోనే డీఆర్పీలు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం జ్ఞాన జ్యోతిలో భాగంగా డీఆర్పీలుగా ఎంపిక చేసిన వారికి కూడా 6 రోజులు రెసిడెన్షియల్ ట్రైనింగ్‌ను అందిస్తున్నారు. మొదటి స్పెల్‌లో భాగంగా ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు షీలానగర్‌లోని మిలీనియం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో విశాఖపట్నం జిల్లాతో పాటు అనకాపల్లి, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన 126 మందికి శిక్షణ ఇచ్చారు. మహిళా శిశు సంక్షేమ శాఖకు చెందిన సూపర్‌వైజర్లు, పీవోలు 54 మంది, మూడు జిల్లాలకు చెందిన ఎస్జీటీలు 72 మంది ఆరు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ పొందారు.


విద్యార్థులకు వినోదం పంచేలా..

ఎఫ్‌ఎల్‌ఎన్ మంచి కార్యక్రమం



ఎఫ్‌ఎల్‌ఎన్‌లో భాగంగా ఇప్పటికే 60 రోజుల శిక్షణలో భాగంగా జిల్లాలో డీఆర్పీలు శిక్షణ పొందారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే డీఆర్పీలు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. రెండో దశ 120 రోజుల పూర్వ ప్రాథమిక, ప్రాథమిక విద్యను బోధించే అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఎస్జీటీలకు శిక్షణ ఇచ్చే జీఆర్పీలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఎఫ్‌ఎల్‌ఎన్ చాలా మంచి కార్యక్రమం.

–ఎల్.చంద్రకళ, డీఈవో

ప్రతీ చిన్నారి సర్వతోముఖాభివృద్ధికి కృషి



ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమంతో ప్రతీ చిన్నారి సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుంది. జ్ఞాన జ్యోతి పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ, పాఠశాల విద్యా శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. రెండు శాఖలు సంయుక్తంగా ఒకే వేదికపై శిక్షణ ఇవ్వడం ఇదే తొలిసారి, చక్కటి వాతావరణంలో ఈ కార్యక్రమం విజయవంతం కావడం సంతోషదాయకం.

–పి.వెంకటరమణ, ఎస్ఎస్ఏ రాష్ట్ర పరిశీలకుడు

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత


మృతుని కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న దొడ్డి రమణ తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76 వార్డు పెద నడుపూరుకు చెందిన పితాని రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయనకు వైఎస్సార్ బీమా మంజూరైంది. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ మృతుని కుటుంబాన్ని పరామర్శించి, తక్షణసాయం కింద మంజూరైన రూ.10 వేలను మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. మిగిలిన సొమ్ము బ్యాంక్ ఖాతాలో పడుతుందని తెలిపారు. నాయకులు తాటికొండ జగదీష్, నాయుడు, పితాని అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


ఎం.చినబాబు (ఫైల్)

కూర్మన్నపాలెం: తన భర్త కనిపించడం లేదంటూ ఓ మహిళ దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించి దువ్వాడ సీఐ శ్రీనివాస రావు తెలిపిన వివరాలివి.. వడ్లపూడి కణితి కాలనీకి చెందిన మల్లపు చిన్నబాబు(47) వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. రోజూ తన కుమార్తెను కాలేజీకి తీసుకువెళ్లి, తీసుకువస్తూ ఉండేవారు. ఈ క్రమంలో జూలై 19వ తేదీన ఎప్పటిలాగే కుమార్తెను చైతన్య కాలేజీలో దించారు. సాయంత్రం కాలేజీ నుంచి తీసుకువెళ్లేందుకు తండ్రి వస్తారని ఎదురుచూసిన కుమార్తె, ఎంతకూ రాకపోయేసరికి ఇంటికి వచ్చేసింది. వచ్చేదారిలో తన తండ్రి ద్విచక్రవాహనం, అతని ఫోన్, వాహన తాళాలు వడ్లపూడి గాంధీబొమ్మ సెంటర్ దగ్గర ఉండడంతో తల్లికి విషయం చెప్పింది. కంగారు పడిన కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతకగా ఎటువంటి సమాచారం లభించలేదు. దీంతో జూలై 21వ తేదీన చిన్నబాబు భార్య రమణమ్మ దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు చినబాబు కోసం గాలింపు చర్యలు చేపట్టినా ఎటువంటి ఆచూకీ లభించలేదు.

అభివృద్ధి పనుల పరిశీలన

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డులో చేపట్టిన అభివృద్ధి పనులను కార్పొరేటర్ బట్టు సూర్య కుమారి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెలలో ప్రారంభించిన మదీనాబాగ్, డ్రైనేజీ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. వార్డులో అభివృద్ధి పనులు 90 శాతం పూర్తి కావచ్చాయన్నారు.

విండ్‌బాల్ క్రికెట్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక: గాజువాక హైస్కూల్ రోడ్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహించనున్న జిల్లా స్థాయి విండ్‌బాల్ క్రికెట్ పోటీల పోస్టర్‌ను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గాజువాక హైస్కూల్ మైదానంలో నిర్వహించనున్న ఈ పోటీల్లో 25 జట్లు పాల్గొననున్నాయన్నారు. ఈ పోటీల్లో మొదటి స్థానం సాధించిన జట్టుకు రూ.10వేలు, రెండో స్థానానికి రూ.6వేల నగదుతో పాటు ట్రోఫీలను అందజేస్తారన్నారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ చైర్మన్ గూటూరు శంకర రావు,ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్ధాంతరంగా ముగిసిన బోనస్ సమావేశం

ఉక్కునగరం: సెయిల్ కార్మికుల బోనస్ సమావేశం అర్ధాంతరంగా ముగిసింది. ఈ ఏడాది సెయిల్ కార్మికులకు బోనస్ చెల్లింపులపై మంగళవారం న్యూఢిల్లీలో ఎన్‌జేసీఎస్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈ ఏడాది నుంచి అమలులోకి రానున్న కొత్త ఫార్ములా ప్రకారం రూ. 22,579 ఇస్తామని సెయిల్ యాజమాన్యం ప్రతిపాదించింది. కార్మిక సంఘాలు గతేడాదిలా రూ. 40,500 ఇవ్వాలని డిమాండ్ చేశాయి. దానికి యాజమాన్యం నుంచి స్పందన రాకపోవడంతో కార్మిక సంఘాల నాయకులు వాకౌట్ చేశాయి.

26 నుంచి వైఎస్సార్ సీపీ సమావేశాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: ఈ నెల 26, 27 తేదీల్లో వైఎస్సార్ సీపీ సమావేశాలు నిర్వహించనున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. 65వ రాజీవ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న ఈ సమావేశాలకు పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలియజేశారు. స్థానిక టీఎన్నార్ ఫంక్షన్ హాల్లో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలు, జేసీఎస్ కన్వీనర్లు ఇతర ముఖ్య నాయకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశాలకు కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జిలు, వార్డు అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, ముఖ్య కార్యకర్తలు హాజరు కావాలని సూచించారు. సమావేశంలో కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నరసింహపాత్రుడు, ఉరుకూటి చందు, రాజాన రామారావు, మహ్మద్ ఇమ్రాన్ నాయకులు ఇల్లపు ప్రసాద్, పల్లా చినతల్లి, ధర్మాల శ్రీను, రాజాన వెంకటరావు, కోమటి శ్రీను, బొడ్డ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధిత చిన్నారికి చేయూత

అగనంపూడి: క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారి వైద్యం నిమిత్తం ఆమె తల్లిదండ్రులకు స్పందన చేయూత ఫౌండేషన్ రూ.5వేల నగదు అందించింది. పరవాడ మండలం భరణికం గ్రామానికి చెందిన సప్ప రిష్మిత క్యాన్సర్‌తో బాధపడుతుంది. పాప అనారోగ్యంపై స్పందించిన వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ పట్టా రామ అప్పారావు తన సన్నిహితులు కలిపి ఇటీవల రూ.పదివేల నగదును ఆమె తల్లిదండ్రులకు అందించారు. పాప పరిస్థితిపై స్పందించిన విశాఖకు చెందిన స్పందన చేయూత ఫౌండేషన్ చైర్మన్ ఈపూరి బుచ్చిరాజు రూ.5వేల నగదును బాలిక తల్లిదండ్రులకు అందించారు. సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎం.మస్తాన్‌రెడ్డి నెలకు సరిపడా బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు అందించారు. గ్రామ సర్పంచ్ శేఖర్, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఉక్కు' పరిరక్షణే ధ్యేయం

కూర్మన్నపాలెం: వేలమంది కార్మికులకు జీవనోపాధి కల్పిస్తూ, దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సాయపడుతున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడమే ధ్యేయంగా కార్మికులు పోరాటం చేస్తున్నారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. దీనికి కేంద్రం సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 978వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక,ప్రజా వ్యతిరేక విధానాలను సమైక్యంగా ఎదుర్కొనేందుకు కార్మికవర్గాన్ని సమాయత్తం చేయాలన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

72వ వార్డులో రూ.74.80 లక్షలతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం


శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులకు పెద్దపీట వేశామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 72వ వార్డులోని వుడా కాలనీ, చినగంట్యాడ, సుందరయ్య కాలనీ, ఆఫీషియల్ కాలనీలలో రూ.74.80 లక్షలతో చేపట్టనున్న రోడ్లు, డ్రైనేజీ పనులకు మంగళవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటికే కోట్లాది రూపాయలతో వివిధ అభివృద్ధి పనులను పూర్తి చేశామని, మరికొన్ని పనులు జరుగుతున్నాయని అన్నారు. పక్కా రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటు కోసం కోట్లాది రూపాయలను వెచ్చించామన్నారు. సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్, స్థానిక నాయకులు రామిరెడ్డి, కుమార్ సాయి, వాసవి నాయుడు, మధు, డేవిడ్, మధుసూదన్‌రెడ్డి, దీప్తి, విజయ, ఆదిలక్ష్మి, హేమలత, పరశురామ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

27న ఓటరు జాబితా ముసాయిదా


సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో లక్ష్మారెడ్డి

గాజువాక: నియోజకవర్గంలో ఓటరు జాబితా ముసాయిదాను ఈ నెల 27న ప్రచురించనున్నట్లు గాజువాక ఓటర్ల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే నియోజకవర్గంలో నిర్వహించిన ఇంటింటి సర్వే సందర్భంగా గుర్తించిన ఆబ్సెంట్, శాశ్వతంగా వలస వెళ్లిన 11,196 మంది ఓటర్లకు నోటీస్–బీలను జారీ చేసినట్టు తెలిపారు. ఈ నోటీసులను స్పీడ్ పోస్ట్ ద్వారా ఓటర్లకు పంపించామని, వాటిని కూడా పరిగణనలోకి తీసుకొని ముసాయిదా జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. అనారోగ్యంతో బాధ పడుతున్న కొంతమంది బీఎల్వోలు, సూపర్‌వైజర్లను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మార్చాలని నిర్ణయించామని, ఆ ప్రతిపాదనలను కలెక్టర్‌కు పంపించామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రతిపాదనలను ఎన్నికల సంఘం ఆమోదించిన వెంటనే ఆ జాబితాలను రాజకీయ పార్టీలకు అందజేస్తామన్నా రు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పి.సింహాచలం, గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి, పెదగంట్యాడ తహసీల్దార్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ


అగనంపూడి దుర్గాలమ్మ ఆలయంలో అన్నపూర్ణాదేవిగా..


బర్మా కాలనీలో అన్నపూర్ణ దేవి అలంకరణలో దుర్గాదేవి


ఎల్‌వీ నగర్‌లో అన్నపూర్ణాదేవిగా కనకదుర్గ

అగనంపూడి: శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని 85వ వార్డు అగనంపూడిలోని దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. భవానీలు, భక్తులు అమ్మవారి సారెను పాత అగనంపూడిలోని బొర్రమాంబ అమ్మవారి వనం నుంచి దుర్గాలమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు.

త్రిశక్తి ఆలయంలో సహస్ర హస్త కంకణార్చన

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి ఆలయంలో మహాదుర్గ అమ్మవారికి మంగళవారం సహస్ర హస్త కంకణార్చన నిర్వహించారు. శ్రీ మహాదుర్గ అమ్మవారిని ఎరుపు వర్ణం చీరలో గాయత్రీదేవిగా, శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని ఆకుపచ్చ వర్ణం చీరలో ధైర్యలక్ష్మిగా, శ్రీమహాసరస్వతి అమ్మవారిని గులాబీ వర్ణం చీరలో శారదాదేవిగా అలంకరించారు. సాయంత్రం మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు.


దుర్గాలమ్మకు సారె తీసుకువస్తున్న భక్తులు

కన్యకాపరమేశ్వరి ఆలయంలో చండీహోమం


త్రిశక్తి ఆలయంలో దుర్గాదేవికి సహస్ర హస్త కంకణార్చన

పెదగంట్యాడ: 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలోని కన్యకాపరమేశ్వరి పంచాయతన ఆలయంలో అమ్మవారిని మంగళవారం అన్నపూర్ణా దేవిగా అలంకరించారు. ఆలయంలో చండీహోమం నిర్వహించారు.

- 76వ వార్డు బర్మా కాలనీ దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

గాజువాక: గాజువాక ఆర్యవైశ్య సంఘం, దసరా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో స్థానిక కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

- 70వ వార్డు ఎల్వీ నగర్ కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

ఆరోగ్య సురక్ష..దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- గిరిజా కాలనీ, కణితి, మంగళపాలెంలో వైద్యశిబిరాలు


గిరిజా కాలనీలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి


మంగళపాలెంలో ఆరోగ్య సురక్ష బ్రోచర్, కిట్‌లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, జెడ్సీ సింహాచలం


కణితి పీహెచ్‌సీలో శిబిరం వద్ద రోగులకు రిజిస్ట్రేషన్ చేస్తున్న వైద్య సిబ్బంది

పెదగంట్యాడ: జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమం ప్రజారోగ్యానికి రక్షగా నిలుస్తోందన్నారు. 65వ వార్డు గిరిజా కాలనీలో యూపీహెచ్‌సీ వద్ద మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పేదలందరికీ నాణ్యమైన వైద్యం అందుతోందన్నారు. రాష్ట్ర ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్న మంచి ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇటువంటి కార్యక్రమం దేశంలోనే మొదటి సారిగా మన రాష్ట్రంలోనే అమలు చేశారన్నారు

226 మందికి సేవలు

శిబిరంలో 226 మందికి 9 మంది వైద్యులు సేవలు అందించారు. రక్త పరీక్షలు, ఇతర పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.విజయలక్ష్మి, గైనకాలజిస్ట్ డాక్టర్ పావని, డెంటిస్ట్ శ్రీనివాస్ చక్రవర్తి, జనరల్ సర్జన్ డాక్టర్ సుజాత, పల్మనాలజిస్ట్ డాక్టర్ రూప, నేత్ర వైద్యురాలు డాక్టర్ అంజలి, స్థానిక పీహెచ్‌సీ వైద్యులు వినయ్, రాజు, కుమార్ పాల్గొని రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పి. సింహాచలం, కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు, నాయకులు లోకనాథం, నాగిశెట్టి శ్రీను, జుత్తు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో విప్లవం

అగనంపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వైద్య రంగంలో సరికొత్త విప్లవమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 88వ వార్డు మంగళపాలెంలోని ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల చెంతకు వైద్యాన్ని తీసుకువెళ్లి చరిత్ర సృష్టించారన్నారు. విద్య, వైద్య రంగాల్లో తీసుకువచ్చిన సంస్కరణలు దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆచరించే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకువెళ్లారన్నారు. కార్యక్రమంలో జెడ్సీ పొందూరు సింహాచలం, 88వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గండ్రెడ్డి కనక మహాలక్ష్మినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, మండల జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, దాడి నూకరాజు, సచివాలయ కన్వీనర్లు వారధి చిట్టమ్మ, మడక నరసింగరావు, శ్యామ్, శనివాడ రాము, లాలం శ్రీను, చంద్రశేఖర్, వారధి రాజు, ప్రమీలా రావు తదితరులు పాల్గొన్నారు.

కణితిలో 280 మందికి వైద్య సేవలు

కూర్మన్నపాలెం: ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పేదల గడప వద్దకే ప్రభుత్వ వైద్యాన్ని ఉచితంగా అందించాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకువచ్చారన్నారు. జీవీఎంసీ 87వ వార్డు కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎరుకులవీధి ప్రజల సౌకర్యార్థం జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని ఎమ్మెల్యే మంగళవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలున్నవారు శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్ల చేత పరీక్షలు చేయించుకుని, వైద్యులు సూచనల మేరకు మందులు వాడుతూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. శిబిరంలో డాక్టర్ శివయ్య, డాక్టర్ స్వరూపరాణిలతో పాటు మరో నలుగురు వైద్యులు ఉదయం నుంచి సాయంత్రం వరకు రోగులకు అవసరమైన అన్ని రకాలైన వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 280 మంది ప్రజలు వైద్య సేవలను పొందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, సచివాలయ సిబ్బంది, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సెయిల్‌తో సమానంగా బోనస్ చెల్లించాలి


ధర్నా చేస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: సెయిల్ కార్మికులతో సమానంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు బోనస్ చెల్లించాలని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప డిమాండ్ చేశారు. బోనస్ అంశంపై మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెయిల్‌తో సమానంగా కార్మికులకు బోనస్ ఇవ్వాలని, గతేడాది బోనస్ బకాయి రూ. 9500 కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, సెయిల్, ఎన్ఎండీసీలను కలపడం ద్వారా మెగా మెర్జర్ చేయలన్నారు. ఉక్కు కర్మాగారానికి సొంత ఐరన్ ఓర్ గనులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్రి దాలినాయుడు, ఎన్నేటి రమణ, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, మార్టుపూడి పరదేశి, దరిగి రవి, డి.పుల్లారావు, బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.